క్లుప్తంగా

అల్పాహారం పంపిణీ



అల్పాహారం అందిస్తున్న నాయకులు

సూర్యాపేట : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాష్ పెళ్లిరోజు సందర్భంగా బుధవారం కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ వద్ద బాటసారులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్, బీఆర్‌ఎస్ సూర్యాపేట మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి పెద్దిరెడ్డి గణేష్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కోమటి శేఖర్, మంచాల చంద్రశేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగా మహరాజ్



అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడిగా అర్వపల్లికి చెందిన బైరబోయిన మహరాజ్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఈదుల యాదగిరిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సాయిని మధు, కనుకు రమేష్, సాయిని మనోహర్, వాకిటి వినయ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని మున్యానాయక్ తండాలో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ అధికారి ఎ.మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టవర్ లైన్ల మరమ్మతు వల్ల అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని తంగెళ్లగూడెం గ్రామానికి చెందిన పెద్ది తిరపతమ్మ ఇటీవల నిర్వహించిన జీజేఆర్ కప్ క్రీడాపోటీలు తిలకించేందుకు వెళ్లగా కిందపడి కాలు విరిగింది. దీంతో వెంటనే స్పందించిన మంత్రి జగదీష్‌రెడ్డి ఆమెకు వైద్యం చేయించారు. అలాగే మంత్రి బుధవారం రూ.10వేలు, బియ్యం పంపించగా సర్పంచ్ బాదె ఈశ్వరమ్మధర్మయ్య, ఉపసర్పంచ్ దేశగాని శ్రీనివాస్‌గౌడ్‌లు బాధిత మహిళకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుక్కడపు నరేష్, అబ్బగాని అనసూయ, మంగమ్మ, నర్సయ్య, మొలుగూరి సుధాకర్, మురళి, కాశయ్య, వీరస్వామి, శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న జయంతి కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : ఈ నెల 18న సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని సామాజిక చైతన్య యాత్ర ఆధ్వర్యంలో బుధవారం పాతర్లపహాడ్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీత కార్మిక సంఘం అధ్యక్షుడు బత్తుల వెంకన్న మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలంతా పాపన్నగౌడ్ ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు భీమగాని గంగయ్య, జిల్లా నాయకుడు కట్ట గోవర్ధన్, యువజన సంఘం అధ్యక్షుడు కట్ట అజయ్, భీమగాని రాములు, వెంకటయ్య, అంజయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు

కోదాడ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అనంతగిరి, నడిగూడెం మండలాలకు చెందిన పలువురు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. సబ్బండ వర్గాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంపటి వెంకటేశ్వరరావు, పాలడుగు ప్రసాద్, మట్టపల్లి శ్రీనివాస్‌గౌడ్, సైదులుగౌడ్, కొండలు, కాసాని వెంకయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములకు అందని జలాలు

- ఆయకట్టుకు గోదావరి నీటిని విడుదల చేసి వారం రోజులు
- 36/1 ఎల్ కాల్వకు చేరని జలాలు
- పొలాలు ఎండిపోతుండడంతో ఆందోళన చెందుతున్న రైతులు



ఆత్మకూరులో ఎండిపోయిన వరి పొలం

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు భూములకు గోదావరి జలాలు అందలేదు. వారం రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. వారబందీ విధానంలో ఆయకట్టుకు నీరు అందిస్తుండగా ఈ నెల 15తో మొదటి విడత వారబందీ పూర్తి కానుంది. అయితే ఇప్పటివరకు తమ భూములకు నీరందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం అయినప్పటికీ, సమృద్ధిగా నీరు ఉండి కూడా అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ భూములు బీడు భూములుగా మారుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఆత్మకూరు మండల కేంద్రంలోని 36/1ఎల్ పరిధిలోని భూములకు చుక్క నీరు అందకపోవడంతో బీడు భూములుగా మారుతున్నాయి. కొందరు నాట్లు వేయగా ఎండిపోతున్నాయి.

నీరు అందక బీడులుగా..

ఆత్మకూరు మండల కేంద్రం పరిధిలోని భూములకు ఎక్కువ శాతం 36/1 ఎల్ ద్వారా ఎస్సారెస్పీ నీళ్లు అందించేలా కాలువలు తవ్వారు. ఈ వానా కాలం ఆగస్టు మొదటి వారంలో నీటి విడుదల ఉంటుందని పేర్కొనగా గత నెల చివరి వారంలో కురిసిన వర్షాలకు కొద్ది మంది రైతులు దుక్కులు దున్ని నాట్లు వేశారు. కొద్దిమంది డ్రం సీడర్ పద్ధతిలో వరిని సాగు చేశారు. ఆ తర్వాత వర్షాలు తగ్గాయి. అయినప్పటికీ వారం పది రోజుల్లో గోదావరి జలాలు వస్తాయన్న ధీమాతో రైతులు ఉన్నారు. అయితే ఈ నెల 9న నీటిని విడుదల చేశారు. కానీ వారం రోజులైనప్పటికీ ఇంతవరకు కాల్వకు చుక్క నీరు రాలేదు. ఓవైపు నీరు రాకపోవడం, మరోవైపు తీవ్రమైన ఎండలతో వరి పంటలు ఎండిపోతున్నాయి. ఇంకా వందలాది ఎకరాల భూమి బీడుగా నీళ్ల కోసం ఎదురు చూస్తోంది.

అధికారుల బాధ్యతారాహిత్యం..

కాల్వ పరిధిలోని పలువురు రైతులు సంబంధిత ఏఈ, డీఈలకు తమ సమస్యను వివరించారు. వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తుండగా మా పరిధిలోని కాల్వకు నీరు రావడంలేదని విన్నవించారు. అయితే మిమ్ముల్ని ఎవరు వరి సాగుచేయమన్నారని.. మేము ఇచ్చే నీళ్లు వరికి కాదని అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. దీంతో సీఈ రమేష్ బాబుకు సమస్యను వివరించగా వరి నాట్లకోసం 15 రోజుల పాటు నీళ్లు ఇస్తామని.. రైతుల ఆందోళన చెందవద్దని సర్ది చెప్పారు. వెంటనే ఓ అధికారిని పంపగా 36/1ఎల్ కాల్వ మొత్తం ఎనిమిది కిలోమీటర్లు ఉండగా కేవలం మూడు కిలోమీటర్ల వరకే నీరు వచ్చినట్లు రుజువైంది. ఇది గడిచి మూడు నాలుగు రోజులైనప్పటికీ నీరు రాకపోవడంతో రైతులు ఆందోళనకు సిద్ధమయ్యే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన ఉన్నందున ఈ సమయంలో తమ నిరసన తెలపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

చుక్కనీరు రాలేదు



ప్రతి సీజన్‌లోనూ మా భూములకు నీరు రావడం లేదు. గత యాసంగిలో నీళ్ల కోసం ఇబ్బందులు పడడం ఎందుకని సాగు చేయకుండా వదిలేశాం. వానాకాలం నీళ్లు వస్తాయని చెప్పి సాగుకు సన్నద్ధమైనా ఇప్పటివరకు చుక్క నీరు రాలేదు. వారబందీ విధానంలో నీళ్లు ఇస్తే పంటలు చేతికి రావడం కష్టమే. ప్రభుత్వం చెప్పిన దానికి క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పొంతన లేకుండా ఉంది. చివరి భూముల వరకు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రైతు, ఆత్మకూరు

రెండు ఎకరాల పొలం ఎండిపోయింది



ఎస్సారెస్పీ 36/1ఎల్ పరిధిలో చివరి ఆయకట్టు భూములు మావి. ఇంతవరకు చుక్క నీరు రాలేదు. ఆగస్టు 10వ తేదీ వరకు నీళ్లు వస్తాయని చెప్పడంతో ఇటీవల కురిసిన వర్షాలకు డ్రమ్ సీడర్ పద్ధతిలో రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. కానీ నీటిని వదిలినా అధికారుల పర్యవేక్షణ లోపంతో చివరి ఆయకట్టు భూములకు నీరు రాలేదు. సమస్యను ఏఈ, డీఈలకు చెప్పినా బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. వెంటనే నీళ్లు ఇవ్వాలి.

– వెంకట్ రెడ్డి, రైతు, ఆత్మకూరు

కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే పరిశీలన



అర్వపల్లి : వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి గాజుల చంద్రశేఖర్

తిరుమలగిరి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తిరుమలగిరి పరిధిలో నిర్వహిస్తున్న లెప్రసీ కేసుల డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ మల్లెల వందన, సీహెచ్‌ఓ మాలోతు బిచ్చునాయక్, డిప్యూటీ డీపీఎంఓలు థామస్, సురేష్, ప్రసాద్, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే అంగవైకల్యం దూరం

అర్వపల్లి : కుష్టువ్యాధిని సకాలంలో గుర్తిస్తే అంగవైకల్యం ఏర్పడకుండా ఉంటుందని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ గాజుల చంద్రశేఖర్ అన్నారు. కుష్టు వ్యాధి కేసుల గుర్తింపునకై బుధవారం అర్వపల్లిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 31వరకు వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎల్.చరణ్, డీపీఎం థామస్, సూపర్‌వైజర్ బి.ప్రసాద్‌రావు, ఆశ కార్యకర్తలు స్వరూప, అరుణ పాల్గొన్నారు.

17,18 తేదీల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

దురాజ్‌పల్లి : ఆగస్టు 17, 18 తేదీల్లో హైదరాబాద్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని అన్నారు. తెలంగాణలో రూ.5వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వాల ధోరణిపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో విద్యార్థులను చైతన్యం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు పుల్లూరి సింహాద్రి, పిడమర్తి భరత్, రహీం, గోపి, ఈశ్వర్, శ్రీనివాస్, శివ, సంతోష్, మల్లేష్, నాగరాజు, లోకేష్, సాయి, చరణ్, కార్తీక్, సంతోష్, సంపత్, వెంకటేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న సీతయ్య

తుంగతుర్తి : సూర్యాపేటలో ఈ నెల 20న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, కటకం వెంకటేశ్వర్లు, దొంగరి శ్రీనివాస్, పులుసు వెంకటనారాయణగౌడ్, బత్తుల జలంధర్, గుండగాని దుర్గయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 20న జరిగే సీఎం కేసీఆర్ భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ కోరారు. అర్వపల్లిలోని మినీ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేటలో మంత్రి జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సీఎం కేసీఆర్ ప్రారంభించి అనంతరం జరిగే బహిరంగసభలో ప్రసంగిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, వల్లపు గంగయ్య, బొడ్డు రామలింగయ్య, పొట్టిపాక సైదులు, బైరబోయిన రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి నివాళి



సూర్యాపేటలో అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని బుధవారం సూర్యాపేట పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు బీజేపీ నాయకులతో కలిసి వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ అబీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, పార్లమెంట్ కో కన్వీనర్ తుక్కని మన్మథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆరూరి శివ, పార్టీ జిల్లా నాయకుడు దాసరి వెంకన్న యాదవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు..?

నాగారం : నాగారం మండలంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో వారిని వెంబడించి ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. స్థానికుల సమాచారం మేరకు.. సూర్యాపేట వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అనుమానాస్పదంగా తిరుమలగిరి వైపు వెళ్తుండగా పోలీసులు సమాచారం తెలుసుకొని వారిని వెంబడించారు. నాగారం మండల పరిధిలోని ఫణిగిరి స్టేజీ వద్ద వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా వారు ఈటూరు మీదుగా మాచిరెడ్డిపల్లి నుంచి బిక్కేవాగు గుండా అడ్డగూడూరు మండలం కోటమర్తి వైపు పారిపోయేందుకు ప్రయత్నించారు. బిక్కేరువాగు ఇసుకలో బైక్ కూరుకపోవడంతో బైక్‌ను అక్కడే వదిలేని ఆ ముగ్గురు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించడంతో ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులు తప్పించుకోగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. తప్పించుకున్న మరో ఇద్దరు వ్యక్తులను అడ్డగూడూరు మండలం ధర్మారం వద్ద అడ్డగూడూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఈ ముగ్గురు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరులో దొంగతనం చేసి పరారీలో ఉన్న నిందితులుగా మండల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

జిల్లాలో మంత్రి చేసిన అభివృద్ధి శూన్యం




19వ వార్డులో యూత్ డిక్లరేషన్ కార్యక్రమంలో పాల్గొన్న పటేల్ రమేష్‌రెడ్డి, తదితరులు

భానుపురి : సూర్యాపేట జిల్లాలో మంత్రి జగదీష్ రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 19వ వార్డులో నిర్వహించిన గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ వనరులను కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటుందని అన్నారు. గల్లీకో బెల్టుషాపు పెట్టి ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చుతున్నారని విమర్శించారు. ఇంటికో గోడ గడియారాన్ని పంపిణీ చేసిన మంత్రి జగదీష్ రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌గౌడ్, వాసంశెట్టి వెంకన్న, తండు వెంకన్న, తండు రమేష్, యర్రంశెట్టి హరి, ఉప్పుల మధు, పెద్దిరెడ్డి రాజా, నేరేళ్ల మధు, స్వామినాయుడు, ఫరూక్, వల్దాసు దేవేందర్, ఉపేందర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై పొంచివున్న ప్రమాదం



సింగారెడ్డిపాలెం శివారులో రక్షణ గోడ లేకుండా కన్పిస్తున్న బ్రిడ్జి



పెన్‌పహాడ్ శివారులో సూర్యాపేట-గరిడేపల్లి వెళ్లే మార్గంలో..

- పలుచోట్ల వంతెనలు, కల్వర్టులకు రక్షణ గోడలు కరువు
- అప్రమత్తంగా లేకుంటే ప్రమాదమే..
- పట్టించుకోని సంబంధిత అధికారులు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై నిర్మించిన వంతెనలు, కల్వర్టులకు పలు చోట్ల రక్షణ గోడలు కరువయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. పలు వాహనదారులు కిందపడి ఆస్పత్రుల్లో చేరుతున్నారు. మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామ శివారు దారిలో చెరువు నుంచి వెళ్లే కాలువపై చిన్న బ్రిడ్జి నిర్మించారు. కానీ రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే పెన్‌పహాడ్ మండల కేంద్రం శివారులో సూర్యాపేట-గరిడేపల్లి ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మించారు. కానీ రక్షణ గోడలు నిర్మించలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనలు, కల్వర్టుల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రక్షణ గోడలు నిర్మించాలి

మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వంతెనలపై రక్షణ గోడలు లేవు. దీంతో ప్రయాణికులు కిందపడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి వంతెనలకు గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– సాయిరి జగదీష్, అనంతారం

వంతెనలను పరిశీలిస్తాం

మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న రక్షణ గోడలు లేని వంతెనలను పరిశీలిస్తాం. నిధులు మంజూరుకాగానే పనులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. తాత్కాలికంగా ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– మహిపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ, డీఈ

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం



మాట్లాడుతున్న పందిరి నాగిరెడ్డి

చిలుకూరు : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకుడు పందిరి నాగిరెడ్డి అన్నారు. బుధవారం చిలుకూరు మండల కేంద్రంతో పాటు సీతారాంపురం, నారాయణపురం గ్రామాల్లో మన ఊరు – మన కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నేరవేరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ, అధికారులు

చిలుకూరు : గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ ఈదయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందికి సంక్షేమ పథకాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీఓ ఇబ్రహిం, ఏపీఓ నిర్మల, ఈసీ మాధవి, టీఏలు స్రవంతి, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థికి అభినందన



విద్యార్థి గణేష్‌ను అభినందిస్తున్న మంత్రి, కలెక్టర్

నూతనకల్ : యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం నల్లగొండ వారు నిర్వహించిన సూర్యాపేట జిల్లా స్థాయి యువ ఉత్సవాల్లో పెదనెమిల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ రాములు నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15న స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఫొటోగ్రఫీ విభాగంలో నిర్వహించిన పోటీల్లో పెదనెమిల పాఠశాల 9వ తరగతి విద్యార్థి గడ్డమీది గణేష్ ద్వితీయ స్థానం పొందినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

రోడ్ల విస్తరణ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.36కోట్లు



అర్వపల్లి : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జాజిరెడ్డిగూడెం మండల బీఆర్‌ఎస్ నాయకులు



నూతనకల్ : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మండల బీఆర్‌ఎస్ నాయకులు

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గంలో వివిధ రోడ్ల విస్తరణ, నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి 2023–24 సంవత్సరానికి గాను సీఆర్‌ఆర్ నుంచి రూ.36కోట్లు మంజూరయ్యాయి. తిమ్మాపురం–సంగెం రహదారి విస్తరణకు రూ.20 కోట్లు మంజూరు చేశారు. ఈనిధులతో ఈ 14 కి.మీ రహదారి విస్తరణ, ఎనిమిది చోట్ల వాగులపై వంతెనల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే సంగెం నుంచి నూతనకల్ మండల కేంద్రం వరకు 4.70 కి.మీ రహదారిని విస్తరించి అవసరమైన చోట వంతెనలు నిర్మిస్తారు. ఇందు కోసం రూ.12కోట్లు మంజూరు చేశారు. నూతనకల్ నుంచి మిర్యాల వరకు 4.70కి.మీ మెటల్ రోడ్డును రూ.4కోట్లతో బీటీగా మార్చుటకు నిధులు మంజూరు చేశారు. టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు.

ఎమ్మెల్యే కిశోర్‌కు గజమాలతో సన్మానం

తిమ్మాపురం–సంగెం రహదారి విస్తరణ కోసం రూ.20కోట్లు మంజూరు కావడంతో ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌ను బుధవారం తిరుమలగిరిలోని క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. అర్వపల్లిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, బి.రామలింగయ్య పాల్గొన్నారు.

రోడ్డు మంజూరుపై హర్షం

నూతనకల్ : మండల కేంద్రం నుంచి మిర్యాల గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, భూరెడ్డి సంజీవరెడ్డి, గుగులోతు సురేందర్‌నాయక్, బద్దం ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి



ఆత్మకూర్ (ఎస్) : సభ్యత్వాలను నమోదు చేయిస్తున్న సంఘం నాయకులు



చివ్వెంల : బి.చందుపట్లలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : ఉద్యోగ, ఉపాధ్యాయ వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రాంత ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కోశాధికారి గుల్ల వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోటినాయక్‌తండా, పాతసూర్యాపేట, ఏనుబాముల, ఆత్మకూరు పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల శాఖ అధ్యక్షుడు పులిచింతల కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిలక రమేష్, సీనయ్య, సాయిశ్యాం, దుర్గాప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

చివ్వెంల : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా కార్యదర్శి బండి పాపిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని బి.చందుపట్ల, వస్త్రాతండా, తిమ్మాపురం, మోదిన్‌పురం, రాంకోటి తండా, ఖాసీంపేట పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దురుసోజు శ్రీనివాస చారి, సైదా, యాదయ్య, శంకర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు సన్మానం

సూర్యాపేటటౌన్ : ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో సన్మానించనున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వయిజర్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ గుర్తింపు కార్డు, జూనియర్ ఇంటర్ పరీక్షల్లో సాధించిన మార్కుల జాబితా కాపీని వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నంబర్ 9248722218ను సంప్రదించాలని కోరారు.

ప్రధాని మోదీ విధానాలతో ఆర్థిక అసమానతలు



సమావేశంలో మాట్లాడుతున్న రవి

దురాజ్‌పల్లి : కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్ణయాలతో ప్రజలు అనేక ఆర్థిక అసమానతలకు గురవుతున్నారని ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక శక్తులపై ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడుతుందని, అవినీతి ప్రభుత్వంగా మారిందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, వరికుప్పల వెంకన్న, నల్గొరి రమేష్, జిల్లా కార్యదర్శి యస్‌కే నజీర్ పాల్గొన్నారు.

- కట్టమైసమ్మ బోనాలు



పిల్లలమర్రిలో బుధవారం నిర్వహించిన కట్టమైసమ్మ దేవాలయ బోనాల వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు